“నా ఫోన్ నెంబరు కూడా మర్చిపోయారా మధూ! ఇండియా వస్తే కనీసం నాకు ఫోన్ చెయ్యాలని కూడా అనిపించలేదా నీకు?!”

ఆ గొంతులో నిష్ఠూరం కన్నా మించినది ... అదేదో ధ్వని. అవతలి వ్యక్తి మాట్లాడలేదు... చేతులు కట్టుకుని సూటిగా ఆమెనే పరీక్షగా చూస్తున్నాడు.

“నా ప్రశ్నకు జవాబు చెప్పలేవని నాకు తెలుసు...”

ఈసారి ఆమె మాటల్లో కొద్దిపాటి నిష్ఠూరచ్ఛాయలు.

నవ్వాడతను...

“కొన్ని ప్రశ్నలే ... జవాబులుండవు...”

“ఇలా రిడిల్స్ మాట్లాడి ఎంతకాలం నన్ను సాధిద్దామని?”

ఈసారి ఆమె గొంతులో దుఃఖం... నిస్సహాయత... ఆ తరవాత స్టేజ్ అతను ఊహించుకోగలడు...

ఇది ఫైవ్‌స్టార్ హోటల్లో జరుగుతున్న గొప్ప బిజినెస్ మాగ్నెట్స్ పార్టీ... ఆమె భర్త అందులో ఒకరు... ఈ అమ్మాయి ఇక్కడ, ఇలా కన్నీటి దేవతగా బైటపడితే...

“నేను నిన్ను సాధించడమా?” ఆ గొంతులో ఏదో ఆశ, చిలిపి తళుకు..

“ఎందుకు మీనా?... వస్తాను...” సూటిగా చూస్తూ చేతులు జోడించి వెళ్లిపోయాడు మధు.



# తేజస్విని

— జలంధర

“ఎందుకు?” ఆ ప్రశ్నతో దుఃఖం భళ్లుమన్నది ఆమెలో. మెల్లగా రెస్ట్‌రూం పక్కకు అడుగులు వేసింది.

“ఎందుకు?” ఆ ప్రశ్నలో చాలా జీవితం ఇమిడి వున్నది మరి!


సాధించడం, దుఃఖపెట్టడం, ఎమోషనల్, బ్లాక్‌మెయిల్, మరి రెండు మెట్లు దిగజారితే కచ్చ సాధించడం... ఇవన్నీ మామూలు తరహా మనుష్యుల ప్రవర్తన... కానీ, మధు?! అతను వేరు. అతని ఉనికిలోనే ప్రత్యేకత వున్నది.

“ప్రత్యేకమైన వ్యక్తి అని అతణ్ణి ప్రెషియస్‌గా ఫీలవడం చాలా కష్టం... నా మాట విను... సంఘం దృష్ట్యా అతను మామూలు ఉద్యోగి... నువ్వా పెద్ద పొలిటీషియన్ కూతురివి. అతడు ఎప్పుడో ఏదో అనుకున్నవన్నీ సాధించాడనుకో, అప్పటికి మీ ఇద్దరూ యాభయ్యవపడిలో పడిపోతారు. నా మాట విని అన్నయ్య తెచ్చిన సంబంధం ఒప్పుకో. పెళ్ళికి కావలసింది ప్రస్తుత కాలంలో స్టేటస్...” స్నేహితురాలైన పెద్ద వదిన ఐదేళ్ల క్రితం హితవు చెప్పింది.

నవ్వొచ్చింది కాలేజీ గర్ల్ మీనాకు. మధు గురించి తను ఒక నిర్ణయానికి రాకముందే, వీళ్ళు అతణ్ణి తను చేసుకుంటానేమోనని జాగ్రత్తపడుతున్నారు.

అసలు ఈ విషయం మాట్లాడవలసిన వ్యక్తి మధు. కానీ అతను తన కోసం వీళ్లనుకుంటున్నట్టు పడిచచ్చిపోవడం లేదు. ఇన్‌ఫాక్ట్... తనే అతని వెనకాల...

ఆలోచించలేకపోయింది మీనా.
ఆ సాయంత్రం అతణ్ణి కలుసుకున్నప్పుడు చాలా పరోక్షంగా,
"నేను నేనుగా ఏమిటంటావు?" అని అడిగింది.
"అంటే?" కాఫీ సిప్ చేస్తూ పరీక్షగా చూస్తూ అడిగాడు మధు.
"నేను, నా అందం, నా...ఔ"
"సారీ!" ఆమె మాటల్ని మధ్యలోనే ఖండిస్తూ,
"కేవలం నువ్వు ఎలా వుంటావో అన్నదే ముఖ్యమైనప్పుడు, అద్దంలో చూసుకుంటూ నిన్ను నువ్వు పోగొట్టుకుంటావు... ఈ జన్మలో నీకు నువ్వు దొరకవు.." తీక్షణంగా అన్నాడు మధు.
ఉలిక్కిపడింది మీనా...
"మరి... నేను నేనుగా... నేను ఇప్పుడు తిరుగుతున్న సొసైటీ, ఈ జనం, ఇవన్నీ కాకుండా, లేకుండా... నేను నేనుగా ఏమిటి అని..." అన్నది సందేహంగా చూస్తూ...
"గుడ్... చాలా విచిత్రంగా ఆలోచిస్తున్నావే... యు ఆర్ రైట్... మనం ఎప్పుడూ మన చుట్టూ మనుష్యులు మన ఇగో ఫీడ్ చేసేవాళ్ళు, మనకు సింపతీ, గుర్తింపు ఇచ్చేవాళ్ళను వెతుక్కుంటాం... అప్పటికి అది హాయిగా వున్నట్లే వున్నా, ఇంక ఎదగలేం... ఒక పని చెయ్యి... ఒక వారం రోజులు నీ రొటీన్ మార్చుకో... నీకు వచ్చింది చెయ్యడం కన్నా, నీకు బాగుంటుందేమో అని అనిపించింది చెయ్యి. అప్పుడు నీలోకి నువ్వు ప్రయాణం చేస్తావు..."
"నాన్సెన్స్... ఇదేదో సెల్ఫ్ హెల్ప్ కొటేషన్‌లా వున్నది.." నవ్వుతూ అనేసింది కానీ, ఆ మర్నాటి నుంచే అదేదో ప్రయత్నించాలని సరదా పుట్టింది.
మధు క్యాంపుకు వెళ్ళాడు. వారం రోజులు. అతడు తిరిగి వచ్చేలోగా, తను తనుగా ఏమిటో చెప్పాలన్న తపన ఎక్కువైంది.
మర్నాడు అలారం పెట్టుకుని ఐదు గంటలకే లేచింది. తన కాఫీ తను కలుపుకున్నది. వాషింగ్, డ్రైయింగ్ తనే చేసుకున్నది. మొక్కలకు నీళ్ళు పోసింది. ఐదుగురు పనివాళ్ళు అమ్మగారిలో ఈ మార్పుకు హడలిపోయారు.
ఒడుం పట్టేసింది. అయినా పంతంగా వున్నది మీనాకు. రొటీన్ ఫోన్ కాల్స్, సాయంత్రం గెట్ టు గెదర్స్, వేటికీ లేనని చెప్పించింది.
బోలెడంత కాలం... ఏం చెయ్యాలి?! నిద్ర రాలేదు... ఎన్నాళ్ళిబట్టో వినాలని దాచుకున్న కేసెట్స్... కాసేపటికి బోర్... విడియోలు... ఒంటరిగా చూడటం కష్టం. అమ్మ గదికి వెళ్ళింది.
"ఏం కావాలమ్మా?" వాన్నా, అమ్మా ప్రశ్న
అవును... ఏదో అవసరం లేనిదే ఏనాడూ అక్కడికి వెళ్లలేదే?!
గార్డెన్లో ఒంటరిగా తిరిగింది... ఏమిటో పిచ్చి పిచ్చి ఆలోచనలు... వీణ తీసి దుమ్ము దులిపింది... తీగ తెగింది. అన్నయ్య పిల్లలను చేర్చి ఆడింది. కాసేపటికి వాళ్ళ కళ్ళల్లో ఏదో ఎలియనేషన్... "నువ్వు మాదానివి కాదు–" అన్న భావన... "నువ్వు వెళ్ళిపోతే మాకు ఇబ్బంది తగ్గుతుంది" అన్న ధ్వని ఏదో.
మౌనంగా తన గదికి వచ్చేసింది.
వదినతో కార్డ్స్ ఆడింది. కచ్చగా గెలిచింది.
"ఓడిపోకపోతే నువ్వు ఊరుకుంటావు తల్లీ!" సన్నగా నవ్వుతూ అన్నది వదిన.
"అంటే?" ఈ గెలుపుకు కూడా తను కర్త కాదన్నమాట...ఛా!
ఏం చెయ్యాలి? ఏదో చెయ్యాలి... తల పగిలిపోతోంది. మనస్సులో పిచ్చి పిచ్చి ఆలోచనలు.
పెద్దన్నయ్యకు లాంగ్ డిస్టెంట్ కాల్ బుక్ చేసింది.



**ఉత్తరం**

విడిచిన చోటే వుండవు చెప్పులు
తగిలించిన చోట చొక్కానూ వుండదు

కన్నీటి కావళ్ళు మోసి మోసీ
బరువెక్కిన నాదేహాన్ని
ఈ వాలు కుర్చీలోనే కూర్చోబెట్టి
వాహ్యాళికెళ్ళాను
ఇంతలోనే అదీ పోయింది ఎక్కడికో
ఇంట్లో అంతా వచ్చారా!!!

టేబుల్ మీద ఉత్తరం–
"నే వెళుతున్నా
నీతో వుంటే అంతా దుఃఖమే"

–ప్రసాదమూర్తి

"ఏం కావాలి మీనా?"
మామూలుగా అయితే చాలా చెప్పేది. కానీ, ఇవ్వాళ రొటీన్ నుంచి తప్పించుకోవాలని,
"ఏమీ ఒద్దు... ఊరికే కాల్ చేశాను..." అన్నది.
ఆ మాటల్లో బోలెడంత ఒటితనం.
"నువ్వు ఊరికే ఫోన్ చెయ్యవే?" ఆ మాటల్లో మోకరీ ఏదో కావాలి కాబట్టే ఫోన్ చేసిందనా?!
అంటే?!
ఏదో సుడిగుండంలాంటి భయం..
మర్నాడు పొద్దున్నకు జ్వరం వచ్చినంత పనైంది. కానీ పట్టుదలగా మర్నాడు ప్రయత్నించింది. ఏవేవో పిచ్చి పిచ్చి తుది మొదలు లేని ఆలోచనలు. తన ఆలోచనలు తనకే భయంగా వున్నాయి.
సాయంత్రం మధు తండ్రి కోసం ఎస్.టి.డి. చేశాడు. తండ్రి ఆఫీసులో ఉద్యోగం అతనికి.
తండ్రికి కనెక్ట్ చేసేముందు,
"మధూ! ట్రై చేస్తున్నాను... బోర్‌గా భయంగా వున్నది..." అన్నది.
"ఏమిటి?"
ఏమిటి! ఏమిటని చెప్పాలి... అసలా ప్రశ్న ఏమిటి? నాతో నేను బ్రతకడం అని చెప్పాలా?!
"అది కాదు.. రొటీన్‌గా కాక, ఏదో డిఫరెంట్‌గా ట్రై చెయ్యమన్నావుగా..."
"లైబ్రరీకి వెళ్ళు... బుక్సు తెచ్చుకో..."
"ట్రై చేస్తాను..."
లైబ్రరీకి వెళ్ళింది. చాలా ఫాసినేటింగ్‌గా అనిపించింది. ప్రపంచంలో ఇన్ని పుస్తకాలు, ఇవి అసలు చదివేవాళ్ళు వుంటారా? ఎన్ని జన్మలు పడతాయి?
కాసేపు తరవాత... ఏదో పుస్తకాల మెతక వాసన... తీసిన పుస్తకాల్లో చించేసిన పేజీలు... వెధవ మనుష్యులు.
పుస్తకాల సంస్కారం వేరు... అది తెలియని మీనాకు కచ్చ పుట్టింది. అన్ని పుస్తకాలు ఒదిలేసి తిరిగి వచ్చేసింది. ఏదో బుక్ షాపు నుంచి పుస్తకాలు కొన్నది. కావాలనే కుక్కరీ బుక్ దగ్గర నుంచి, ఫిలాసఫీ బుక్ దాకా కొన్నది. ఇంటికి వచ్చి, బెడ్ మీద అన్నీ పరుచుకుని... ఒక్కొక్కటి తియ్యనూ... ఏకాగ్రత రెండో పేజీకే పోవడం... మత్తులోకి జారిపోవడం... విసుగు...

విసుగు.

సాయంత్రం కొత్త టెక్నిక్స్ ప్రయత్నించింది.

గుడికి వెళ్ళింది.

ఆ క్యూలు, ఆ జనాలు, ఆ కొబ్బరికాయలు, పూజారుల చెమట, హారతి కర్పూరం, కుంకుమ – మూడూ కలిసిన తడిసిన ఏదో భయంకర వాసన. చెమటతో తడిసిన పట్టుచీరలు, కారిపోతున్న కుంకాలు, హిస్టీరికల్‌గా కనిపిస్తున్న భక్తి, పట్టుపంచల సెక్స్ ఆఫీళ్ళూ దొంగ చూపులు...

దక్షణను బట్టి ప్రసాదం..

ఛీ! ఛీ... మందలోని జనం... భగవంతుడంటూ వుంటే ఎలా కనబడతాడిక్కడ?!

నామ ఘోష వింటూ, చెవులు రెండూ మూసుకుని, తప్పించుకు పారిపోయి కారు వున్నదని కూడా మర్చిపోయి ఆటోలో వెళ్ళి బీచ్‌లో దిగిపోయింది మీనా..

బీచ్‌లో కూర్చుంది కాసేపు. వెన్నెల, చల్లగాలి హాయిగా వున్నది. కానీ అది ఎంతోసేపు లేదు... కాలి పట్టా ఇసుకలో పారేసుకున్న ఎత్తు ముక్కు అరవ పిల్ల "పాతీళా మామ" – అంటూ ఆమె చుట్టూ తిరుగుతోంది. బటాణీ సుండల కుర్రాళ్ళు ఎలాగైనా కొనమని సేల్స్ మెన్‌షిప్ ప్రకటిస్తున్నారు. ఎవరో గట్టిగా రన్నింగ్ కామెంట్రీలా ఒకటే కబుర్లు. ఏదో చీప్ టాక్.

విసుగుపుట్టి ఇంటికి వచ్చేసి, మంచం మీద బోర్లా పడుకుని నిద్రపోయింది.

పొద్దున్నే తొమ్మిది గంటలకు లేచింది. మాచింగ్ బ్లౌజు కోసం చీరలు తీసింది. స్నేహితురాళ్లకు ఫోన్ చేసింది. హాయిగా షాపింగ్ చేసుకున్నది. సాయంత్రం మూవీ, ఐస్‌క్రీం పార్లర్. ఐదారు గంటలు ఏసి షోరూముల్లోనూ, థియేటర్లలోనూ, పేవ్‌మెంట్ మీద ఎక్కడా ఆమె ఉత్సాహం అణగలేదు... ఏవేవో మాట్లాడుతూనే వున్నది. స్టార్ క్రికెటర్స్, టి.వి. ప్రోగ్రామ్స్, ఎవడో రోమియో... ఒకటేమిటి? వెరైటీ టాపిక్స్... నోరు మూతపడలేదు ఆమెకు.

ఆ మర్నాడు ఏవో ఫ్లవర్ షో...

మూడో రోజు ఏదో ఫైవ్‌స్టార్ హోటల్లో వాంటిక్స్ ఎగ్జిబిషన్ ఐదారుగురు స్నేహితురాళ్ళు గుంపుగా వెళ్లడం, డ్రెస్సింగ్‌కే ఒక గంట, హాయిగా తుళ్లుతూ కబుర్లు.

ఆ తరువాత మధూ వచ్చి,

"ఎలా వున్నావ్?" అనేదాకా ఆమెకు తన ప్రయత్నం గుర్తుకురాలేదు.

"బాగానే వున్నాను..."

"ఏమైంది నిన్న నువ్వు తెలుసుకునే ప్రయత్నం?" మునిపంటితో పెదవి నొక్కిపెట్టి తమాషాగా నవ్వుతూ అడిగాడు.

"నా మొహంలా వున్నది... ఏం బాగాలేదు..."

"ఎందుకని?"

"ఎందుకని అంటే..." మాటలకు తడుముకున్నది.

"అంటే... నీతో నువ్వు ఏ మాత్రం బ్రతకలేకపోయావన్న మాట... నీ ఒంటరితనం నిన్ను చాలా భయపెట్టినట్లుంది?!"

అవును, కాదు... అన్నట్లు తలూపింది.

తను చేసిన ప్రయత్నాలు చెప్పింది. తన ఫీలింగ్స్ చెప్పింది. తనను కొన్ని పరిస్థితులు ఎంత డిప్రెషన్‌లో పడేశాయో, ఎంత కచ్చ పుట్టించాయో కొంచెమే చెప్పింది.

నవ్వాడు మధు...

"ఆ తరవాత మూడు రోజులు?!"

"హాయిగా ఉన్నాను..." రిలీఫ్‌గా అన్నది.

"నిజమే... హాయిగా వున్న ఆ మూడు రోజుల ఖర్చు, అందులో ఉపయోగపడే ఖర్చు... పేపరు మీద రాయి."

దెబ్బతిన్నట్టు ఒక్కసారి తలెత్తి చూసింది మీనా.

ఒద్దనుకుంటూనే మనసులో ఉజ్జాయింపుగా లెక్కలు వేసింది... సగటున రోజుకు వెయ్యి రూపాయిలు!

"నువ్వు ఎంత ఖర్చుపెట్టావో నాకు చెప్పద్దుకానీ, నీ మనశ్శాంతి ఖరీదు రోజుకు "అంత" అని అర్థమైందా?! "

అతని వంకే చూస్తూ వుండిపోయింది మీనా.

"పిచ్చి మీనా... ఇది నిజమైన మనశ్శాంతి అయితే, కొనుక్కున్నా తప్పు లేదు. కానీ మీ ఖర్చులో గిల్టీనెస్ వున్నది. తప్పనిసరి వున్నది. దేన్నో తప్పించుకోవాలన్న భయమున్నది. ఇన్‌సెక్యూరిటీ వున్నది.. ఏవాడూ లేనిది ఇన్ని షాపింగ్ ఆర్కేడ్స్ ఎలా వెలుస్తున్నాయంటావు?! ఎన్నో లక్షల బట్టల షాపులు?! ఎవరూ తెలివితక్కువగా బిజినెస్‌లు ప్రారంభించరుగా... మీ వర్గాన్ని వాళ్ళు గుర్తుపట్టారు. సమ్‌థింగ్ డిఫరెంట్, సమ్‌థింగ్ యూనిక్ అనే మీ ఇన్‌సెక్యూరిటీకి అనువాదం వాళ్లకు అర్థమైంది. మీ టెన్షన్‌ను వాళ్ళు క్యాష్ చేసుకుంటున్నారు. ముందు టెన్షన్ – దాన్నించి బైటపడటానికి తిండి కొంతమందికి రిలీఫ్ అయితే, షాపింగ్ కొంతమందికి... ఇదొక జబ్బు... ముందు సంఘంలో రోగుల్ని తయారుచేసుకుని, వాళ్ళ మీద ఆధారపడి బ్రతికే బిజినెస్‌మెన్ దేశమంతటా వున్నారు... అసలు మీకు..."

విడిగా మధు ఈ మాటలు చెప్తే ఎలావుండేదో. కానీ వంటింటి గుమ్మంలో

## బెజవాడంత టెంపరేచర్!



'దాగుడు మూడతలు' సినిమాలో శారద, పద్మనాభం కలసి సూర్యకాంతం జ్వరాన్ని కొలిచేటప్పుడు ఈ సంభాషణ.

అమ్మడు (శారద): అమ్మ బాబోయ్, బెజవాడంత వచ్చేసింది.

సూరమ్మ (సూర్యకాంతం): బెజవాడేమిటే!

అమ్మడు: అవునత్తయ్యా! 118 డిగ్రీలుంది.

సూర: అమ్మో! అయిను బాబో–అయిను! అయినా 118 డిగ్రీలుంటే మనుషులు బతుకుతారటే!

అమ్మడు: ఆ...బెజవాడలో మనుషులు బతకటంలేదా?

– 'బాపూరమణీయం'

పనివాళ్ళు ఏమిటో? అన్నట్లు చూస్తున్న పెద్ద వదిన – ఎవరైనా వింటున్నారు, చూస్తున్నారు అన్న టెన్షన్‌లో జీవితంలో ఎన్ని విలువైనవి పోగొట్టుకుంటామో ఆ తరవాత చాలాకాలానికి అర్థమైంది మీనాకు.

కానీ, అప్పుడు మాత్రం...

"అంటే నీ ఉద్దేశం?"... దెబ్బ తిన్న ఆడపులిలా అరిచింది. నానా మాటలు మాట్లాడింది. నీకు కలలో కూడా దొరకని జీవితం నాకు వున్నది కాబట్టి నీకు అసూయ... అన్నంత నీచంగా చాలా చాలా మాట్లాడేసింది.

తల వంచుకుని వెళ్ళిపోయాడు మధు. ఆ మర్నాడే రిసిగ్నేషన్ పంపించాడు.

వెంటనే నాన్నగారు, అన్నయ్య చెప్పిన సంబంధం ఒప్పుకున్నది. "నాలుగు డిస్టిలరీలు, ఐదు ఫ్యాక్టరీలు ఒక పక్క, రెండు ఫైవ్ స్టార్ హోటళ్ళు, వలభై ఎస్టేట్స్ మరొక పక్క –" ఎంత గొప్ప పెళ్ళి అని సంతోషించారు కొందరు.

"ఆ ! తప్పించుకున్న ఛార్జ్‌షీట్లు, కనీసం ముప్పై మర్డర్లు ఒక పక్క, బాంబు కేసులు, విదేశీ స్మగ్లింగ్, పద్దెనిమిది రేప్ కేసులు మరొక పక్క..." అన్నారు గిట్టనివాళ్ళు.

కానీ, మీనా దాదాపు మూడు వెలలు ఫ్లైట్‌లో వెళ్ళి షాపింగ్‌లు

## డాలర్లూ–డాల్డాలూ



దొర (రావుగోపాలరావు): మనూరికి ఫ్యాక్టరీ వచ్చిందంటే సింతసెట్టుకెన్నాకులో అన్ని లక్షల రూపాయలు కురుస్తాయి. నీ బిడ్డ కొండంత సదువులు సదివేసి అమెరికా ఎళ్లిపోతాడు. మీ ఫాదరుకి సాలుకి పదేల డాల్డాలు అంపిస్తాడు.

పాల్ (సారథి) డాడీ! డాలర్స్ అనాలి. డాల్డాలు కాదు.

దొర: డాలరంటే తేలిపోద్దిరా. డాల్డా అంటే మాటకు బరువుంటది.

– 'మనవూరి పాండవులు'లో

'బాపూరమణీయం'

చేసుకున్నది. ఆ తరువాత పెళ్ళి, హడావిడి, హనీమూన్ కనీవినీ ఎరగని బహుమతులు, సొంత బంగ్లా, అతిథులు, పార్టీలు – చీరల మెయిన్టెనెన్స్‌కే వారానికి ఒక రోజు తప్పడం లేదు. వచ్చే జనం, పొయ్యే జనం.

ఏదో జైంట్‌వీల్ కుదుపులులా కొన్ని థ్రిల్లింగ్‌గా, కొన్ని భయంగా..

కాన్పు... పాపాయి... భర్త మీద కేసులు, బిజినెస్ టెన్షన్. అదంతా డ్రింక్స్ మీదా, భార్య మీదా తీర్చుకోవడం. ఆమె చుట్టూ సర్వవ్యాపకమైనది ఒకటే... టెన్షన్. గొంతు తడారిపోయే టెన్షన్. ఆమె ముఖం ముడువులో ఏదో నిరంతర ఆందోళన ... కళ్ళు పాలిపోయి... ఎన్ని బ్యూటీపార్లర్స్ కూడా ఆమె స్నిగ్ధ సౌందర్యాన్ని తిరిగి ఇవ్వలేకపోతున్నాయి. లావైతే భర్త కామెంట్ చేస్తాడని డైటింగ్‌లు... టెన్షన్, ఆకలి తగ్గాలంటే షాపింగ్ ఏవో, ఏవేవో కొనిపడెయ్యడం, ఆ కొన్నీవాటి ప్రదర్శనకు పార్టీలు...

కొన్నవి ఎవరికైనా చూపించకపోతే ఎలా? నిద్దర రాదే?! చూడాలి... మెచ్చుకోవాలి... కానీ ఆ మోడల్ నగో, చీరో ఎవరైనా కాపీ కొడితే భరించలేక మార్చెయ్యాలి... తన యూనిక్‌నెస్ పోదూ...

షాపింగ్ ఆర్కేడ్‌లో అడుగు పెడుతున్నప్పుడల్లా విధిగా మధూ, అతని మాటలూ గుర్తుకువచ్చేవి.

జీవితం అయిపోయింది అనిపించే విసుగు ఛాయలు..

ఖర్చుపెట్టుకోవడానికి బీరువాలోనించి డబ్బులు తీసుకోవడంతలో తప్ప మరే విషయంలోనూ భర్తకూ, ఆమెకూ సయోధ్య లేదు.

బీరువా... మొద్దుగా... ఎత్తుగా... మొరటుగా... భర్తలా... ఉలిక్కిపడు తోంది ఆమె.

"నువ్వు దొరకడం నా అదృష్టం మీనా" – అని హనీమూన్‌లో అన్న భర్త.

"నిన్ను భరించడానికి నీ బాబు కానుకలంటూ కట్నంగా పాపవు సొమ్ము చాలా ఇచ్చాడుగా... తప్పదు మరి.." అంటున్నాడిప్పుడు.

మొదట్లో చెలరేగి, ఆర్గ్యుమెంట్స్ చేసి, మీ బతుకులు మాకు తెలియవా అని ఇద్దరూ కచ్చకొద్దీ అసహ్యంగా కొన్ని నిజాలు బైటపెట్టుకునేవారు. ఆ తరవాత అతను డ్రింక్స్‌కు, ఆమె షాపింగ్ లకు, ఆ తరవాత,

"ఆర్గ్యుమెంట్స్ కామన్‌సెన్స్‌ని చంపేస్తాయి మీనా..." అనే మధు మాటలు గుర్తుకువచ్చి మౌనం నేర్చుకున్నది.

తన జీవితంలో ఏదో ఒంటితనం... మహాశూన్యం..

అలంకారాలు, వగలు, చీరలు, బహుమతులు – ఇవన్నీ ఆ ఒంటితనాన్ని కప్పివుచ్చడం లేదిప్పుడు.

సూర్యోదయాన్ని చూసి ఆగిపోతోంది ఇప్పుడు ఆమె. స్విమ్మింగ్ పూలులో చంద్రోదయం... చిన్ని కొలనులో విచ్చిన తామర పూవులు... ఇవన్నీ ఇంటీరియల్ డెకరేటర్ అలంకారాలకు పెట్టించాడు ఒకప్పుడు. కానీ... ఇప్పుడు ఆమె వీటిల్లో ప్రాణమున్నదనిపిస్తోంది.

మధు... మధు...

చాలాసార్లు గుర్తుకు వస్తున్నాడు అతను... కానీ... కానీ... ఈ అకుప చ్చని లాన్ల మీద అతని అడుగులు ఇప్పుడు కావు. ఎప్పుడూ పడవు. ఈ మొలకెత్తుతున్న సౌందర్యాలకు అతని స్పర్శ, స్పందనల కాంతి పుంజాలు అందవుగాక, అందవు.

ఆమెలో ఏదో నెమ్మది, భరించగలిగినంత నిశ్శబ్దం. అటువంటి సమ యంలో ఫారిన్ ముద్రతో ఒక కవరు.

"నా తేజస్వినీ!

ఆ సంబోధనకు ఉలిక్కిపడింది. సంతకం చూసింది. ఆమె ఒళ్లు ఝల్లుమన్నది. మెల్లగా చదవడం ప్రారంభించింది:

"ఏవరనుకున్నావు మీనా? నువ్వే... నువ్వే... నేను ఇది చేస్తాను... అది చెయ్యను అని అనుకునే వ్యక్తి దారుణంగా చాలా పోగొట్టుకుంటాడు. అటువంటి వారిలో ప్రేమ బీజాలు పడవు. పడినా మొలకెత్తవు మీనా... ఈ మాటలు జె.కె.వి.

ఎదటి మనిషిని పోగొట్టుకుంటానేమోనన్న భయం ఒక్కొక్కప్పుడు మని షిలో మంచిగా కనబడాలన్న తపన ఏర్పడవచ్చు. అది హిపోక్రసీ. కానీ, కనీసం... నువ్వు అనాడు... మనం విడిపోయిన రోజు ఆ నాటకం ఆడలేదు. అనవసరంగా ఇద్దరం ప్రలోభానికి లోనై, జీవితాంతం కట్టుబడి బందలుగా మారిపోయి వుండేవాళ్లం.

కానీ, నీ కొక విషయం తెలుసా మీనా!! ఇప్పుడు చెపితే నీకు అర్థమౌతుంది.

నిన్ను నేను విపరీతంగా ప్రేమించాను. ఆరాధించాను.' ఏం చూసి' అని అడగకు. ఆ ప్రశ్నకు జవాబు వెతికితే, కొన్ని అద్భుతమైన ప్రేమ కథలకు అర్థాలే వుండవు. నువ్వు ఎలాగో వుండాలనుకునేవాణ్ణి. నిన్ను మార్చాలని నేను ఎన్నో నేర్చుకున్నాను. నీకు చెప్పాలని నేను ఎంతో చదువుకున్నాను. కానీ, నాకు జీవితం అంత అవకాశం ఇవ్వలేదు.

ఆ రోజు పార్టీలో ఇన్నేళ్ల తర్వాత నిన్ను చూసినప్పుడు ఆశ్చర్యంగా నీలో నేను వెతుక్కునే నువ్వు కనబడ్డావు. ఆశ్చర్యపోయాను. భయపడ్డాను. బాధ పడ్డాను. కాలపు నిశ్శబ్దపు చక్రాలను వెనుకకు తిరగమని ప్రార్థించాను.

కానీ ఇదంతా భ్రమ.

'His beloved embodees the beauty that his innermost Soul Seeks" - అంటాడు ఖలీల్ జిబ్రాన్.

ఇంతకాలం "నువ్వేమిటి?" అంటూ బాధపడ్డాను.

ఈనాడు నువ్వేమిటిలా? అనుకుని నివ్వెరపోతున్నాను.

నా గుండెల్లో రూపుదాల్చిన తేజస్వినిని ఈనాడు నీలో చూసి నిశ్శబ్దంలోకి పారిపోతున్నాను.

నేను నీ నుంచి... నీలోకి...

నీ మధు

తను ఈ మధ్య ఏర్పరుచుకున్న లైబ్రరీలో మౌనంగా కూర్చుంది మీనా... ఆ అక్షరాల కిరణాల గజిబిజి చీకటి సౌధంలాంటి ఆమె జీవితంలోకి ఒక్కసారిగా నిశ్శబ్దపు తలుపులు తోసుకుని ప్రవేశించింది.

ఆ తరువాత... ఆ తరువాత ఆమె మామూలుగానే వున్నది ప్రపంచం దృష్టిలో.

కానీ, ఇప్పుడు ఆమె ఎప్పుడైనా ప్రేమ గురించి ఎవరైనా మాట్లాడినా, విన్నా, ఎక్కడన్నా చదివినా... ఆమె పెదవుల మీద అర్థవంతమైన చిరునవ్వు...

ఆ అర్హత రావడం... అది మామూలు విషయమా మరి?! ◆